క్లుప్తంగా

రామయ్యను దర్శించుకున్న ఎమ్మెల్యే

ఇల్లెందు: భద్రాచలం శ్రీ సీతారామచంద్రమూర్తిని ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ దర్శించుకున్నారు. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేసి ప్రసాదం అందజేశారు. ఆమె వెంట మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ లాల్‌సింగ్, 11వ వార్డు కౌన్సిలర్ సీహెచ్ శ్రీనివాస్ ఉన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే ప్రజారంజక పాలన


మాట్లాడుతున్న కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: ప్రజాభీష్టంకు మేరకు పరిపాలన ఉండేందుకు ప్రజలు కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టాలని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య పిలుపునిచ్చారు. మామిడిగుండాలలో పలు కుటుంబాలు వివిధ పార్టీల నుంచి శనివారం రాత్రి కాంగ్రెస్‌లో చేరాయి. వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మూతి కృష్ణ అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అధినాయకత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. గడిచిన దశాబ్ద కాలంగా అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వారి కార్యకర్తలకు అమలయ్యేలా చూస్తున్నారని ఆరోపించారు. నేటికీ ప్రతిగ్రామంలోనూ భూములకు పట్టాలు రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అందులో మామిడిగుండాల ముందు వరసలో ఉందన్నారు. పులి సైదులు, అరెం కిరణ్, కిన్నెర నర్సయ్య, మండల రాము, పూనెం సురేందర్, పాయం స్వాతి, పాయం లలిత, కల్తి పద్మ, తాటి భిక్షం, సూర్నపాక సత్యనారాయణ, ముక్తి రాజు, ధరావత్ వీరేష్, సూర్నపాక కృష్ణ, వీరస్వామి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


నగదు అందిస్తున్న నాయకులు

పాల్వంచ: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం అందించారు. మండలంలోని కేపీ జగన్నాథపురం గ్రామానికి చెందిన షేక్ మైబూబీ కొంతకాలంగా థైరాయిడ్ దీర్ఘకాలిక సమస్యతో బాధపడుతోంది. ఈ మేరకు పాల్వంచ మండల నూర్ బాషా సంఘం ఆధ్వర్యంలో శనివారం రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో షేక్.సైదులు, షేక్.ఖాసీం, షేక్.కమాల్, నాగూర్‌వలీ, షేక్.ఖాసీం, మౌలా సిద్దు, రసూల్, రహీం, బడేమియా తదితరులు పాల్గొన్నారు.

యాక్టింగ్ క్లర్క్‌లకు న్యాయం చేయాలి

ఇల్లెందు: సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగంలో చేరిన గ్రాడ్యుయేట్స్ సుమారు 600 మంది వివిధ కార్యాలయాలలో మాన్వేలలో, వే బ్రిడ్జిలలో ఇతర డిపార్ట్‌మెంట్లలో క్లరికల్ ఉద్యోగాలు నిర్వహిస్తూ కంపెనీకి సేవలు అందిస్తున్నారని వారికి ఉద్యోగపరంగా అన్ని రకాలుగా న్యాయం చేయాలని టీజీబీకేఎస్ సింగరేణి యాజమాన్యాన్ని కోరింది. శనివారం ఇల్లెందులోని టీజీబీకేఎస్ కార్యాలయంలో ఉపాధ్యక్షుడు ఎస్ రంగనాథ్‌కు క్లరికల్ ఉద్యోగులు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఇల్లెందులో 30 మంది డిపెండెంట్ క్లరికల్ స్టాఫ్ లేని కారణంగా మూడు సంవత్సరాలుగా యాక్టింగ్ క్లర్క్‌లుగా పని చేస్తున్నారని తెలిపారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా క్లరికల్ ప్రమోషన్లు కల్పించి న్యాయం చేయాలని, ఈ విషయమై తమ సంఘం గౌరవాధ్యక్షులు కవిత, వెంకటరావుల దృష్టికి తీసుకెళ్లానని రంగనాథ్ వారికి హామీ ఇచ్చారు.

సంప్రదాయాలను కాపాడుకుందాం..

పాల్వంచ: దేశ ఔన్నత్యాన్ని చాటే సంస్కృతి, సంప్రదాయాలను ముందు తరాలకు అందించేందుకు కృషి చేయాలని పాల్వంచ డీఎస్పీ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం స్థానిక కేఎస్‌పీ రోడ్‌లో వాసవీ ఫంక్షన్ హాల్‌లో రాజు మ్యూజికల్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు డీఎస్పీ బహుమతులు అందించారు. మాట్లాడుతూ.. బాలసుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం కళాకారులను ప్రోత్సహించే విధంగా కార్యాక్రమం నిర్వహించడం అభినందించారు. కళలను, కళాకారులు రానున్న రోజులు మరింత మంది తయారు కావాలన్నారు. కార్యక్రమంలో సీఐ వినయ్‌కుమార్, ఎస్‌కే సైదులు, డాక్టర్ యుగంధర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, సంగీతరావు తదితరులు పాల్గొన్నారు.

సభలకు మైదానాలు కరువు..!

- ఉత్సవాలకు, బహిరంగ సభలకు తప్పని వెతుకులాట..
- ముందు చూపు లేని పాలకులు


సింగరేణి జేకే సీఈఆర్ క్లబ్ గ్రౌండ్

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలో భారీ బహిరంగ సభలకు మైదానాలు కరువయ్యాయి. నవంబర్ 1న సీఎం కేసీఆర్ ఇల్లెందులో ఎన్నికల ప్రచార సభకు బహిరంగ సభకు స్థలాభావం ఏర్పడింది. సీఎం సభకు సుమారు 75 వేల మందిని తరలించాలని నిర్ణయించారు. ఇంతమందికి సరిపడా గ్రౌండ్ లేకపోవటంతో ఊరి బయట పంట పొలాలు, ఖాళీ స్థలాలు, బీడు భూములను ఎంపిక చేయాల్సి వస్తోంది. ఇల్లెందు – కొత్తగూడెం ప్రధాన రహదారిలో బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం– మదర్సా వెనుక మొట్లగూడెం వెళ్లే రహదారిలో ఓ ఖాళీ స్థలాన్ని ఎంపిక చేశారు. ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో ఈ సభా స్థలం ఉండటంతో సీఎం సభకు వచ్చే ప్రజలను ప్రత్యేకంగా వాహనాల్లో తరలించాల్సి ఉంటుంది. అదే పట్టణంలో ఉన్న స్థలం అయితే పట్టణానికి చెందిన 24 వార్డులతో పాటు ఇందిరానగర్, బాలాజీనగర్, సుభాష్‌నగర్, సీఎస్‌పీ, మొండితోగు పంచాయతీలకు చెందిన వారు ఎవరికివారు హాజరయ్యే అవకాశం ఉంటుంది. ఇప్పుడు మొట్లగూడెం వరకు వెళ్లాల్సి ఉన్నందున ఆయా పట్టణంలోని 24 వార్డులు, ఐదు గ్రామ పంచాయతీల బాధ్యులు సభకు హాజరయ్యే ప్రజలను తరలించే బాధ్యత తీసుకోవాల్సి ఉంది.

సీఎం సభకు మొట్లగూడెం వద్ద స్థలం ఖరారు..

సీఎం కేసీఆర్ పాల్గొనే సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే హరిప్రియ వారం రోజుల పాటు సభాస్థలం కోసం పలుచోట్ల వెతికారు. తొలుత సింగరేణి స్కూల్ గ్రౌండ్‌ను పరిశీలించారు. కానీ ఈ గ్రౌండ్‌లో 10 వేల మంది కెపాసిటీ మాత్రమే ఉంది. ఇక 24 ఏరియా రస్స్ అండ్ గోల్స్ గ్రౌండ్‌ను పరిశీలించారు. ఈ గ్రౌండ్ కూడా 20 వేల మందికి మించి కెపాసిటీ లేకపోవటం, పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉండటంతో విరమించుకున్నారు. ఇక లలితాపురం వద్ద ఓ మామిడి తోట పక్కన గల ఖాళీ స్థలాన్ని ఎంపిక చేసినప్పటికీ సీఎం సభకు సరిపడే స్థాయిలో అనుకూలతలు లేవు. పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది. ఖమ్మం జిల్లా పరిధిలో వస్తుండటంతో అంతిమంగా ఆ స్థలం ఉపయోగంగా లేదని విరమించుకున్నారు. ఇక ఇల్లెందు– కొత్తగూడెం రోడ్‌లో మదర్సా వెనుక మొట్లగూడెం వెళ్లే రహదారి పక్కన గల ఖాళీ స్థలం ఎంపిక చేశారు. ఈ స్థలం పార్కింగ్‌కు రాకపోకలకు హెలీప్యాడ్‌కు అన్ని అనుకూలతలు ఉండటంతో ఖరారు చేశారు. అయితే ఊరికి దూరంగా రెండు కిలోమీటర్ల దూరంలో ఉండటం కొంత ఇబ్బందిగా మారింది. ఈ సభకు హాజరయ్యే వారు ప్రత్యేకంగా వాహనంలో వెళితే తప్ప అక్కడికి చేరుకునే అవకాశం లేదు.

ఉత్సవాలకు, బహిరంగ సభలకు ఇబ్బందులు..

ఇల్లెందు పట్టణంలో పండుగలకు, బహిరంగ సభలకు మైదానాలు కరువయ్యాయి. ప్రతీ ఏటా వెతుకులాట తప్పటం లేదు. దసరా ఉత్సవాలు నిర్వహించే ఫారెస్టు గ్రౌండ్, జమ్మి గ్రౌండ్‌లు ప్రభుత్వం నుంచి చేజారిపోయాయి. జమ్మి గ్రౌండ్ తమదంటూ సీఎస్ఐ చర్చి ఆధీనంలోకి తీసుకున్నారు. చుట్టూ ఫెన్సింగ్ నిర్మించి అందులో సిలువను కూడా ప్రతిష్ఠించారు. ఇక ఫారెస్టు గ్రౌండ్‌ను ఏడాది క్రితం న్యాయశాఖ ఆధీనంలోకి తీసుకుని కోర్టు భవనాలు నిర్మాణం చేయాలని నిర్ణయించారు. ఈ గ్రౌండ్‌లో ఏటా దసరా ఉత్సవాలు రావణ వధ జరిగేది. దీంతో గత ఏడాది జేకేలోని సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లోకి మార్చి అక్కడ ఉత్సవాలు నిర్వహించినప్పటికీ రాకపోకటకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

వాహనాల్లో వెళ్లాల్సి వస్తుంది..



సీఎం సభకు మొట్లగూడెంకు వాహనాలలో వెళ్లాల్సి ఉంటుంది. పట్టణంలో భారీ బహిరంగ సభలకు మైదానాలు లేకుండా పోయాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి పట్టణానికి వచ్చినవారు సభలు చూసి వెళ్లే అవకాశం ఉండేది. ఫారెస్టు గ్రౌండ్ కోర్టుకు, సీఈఆర్ క్లబ్ గ్రౌండ్ మినీ స్టేడియంకు కేటాయించారు. సింగరేణి జేకే స్కూల్ గ్రౌండ్, 24 ఏరియా గ్రౌండ్‌లకు పార్కింగ్ సమస్యలు ఉన్నాయి. ఫారెస్టు గ్రౌండ్, సీఈఆర్ క్లబ్ గ్రౌండ్‌లు సభలకు ఎంతో ఉపయోగంగా ఉండేవి.

– జోగ రమేష్, ఇల్లెందు

రాష్ట్రంలో అధికార మార్పిడి జరగాలి..

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వాలు, నాయకులు మారుతున్నా పారిశ్రామిక ప్రాంతమైన రామవరం ప్రజల తలరాతలు మాత్రం మారటం లేదని అధికార మార్పిడి తోనే ఇది సాధ్యమవుతుందని బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి యెర్రా కామేష్ అన్నారు. మన కొత్తగూడెం – మన కామేష్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి రామవరం 6, 7, 8వ వార్డులలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. రామవరం ప్రాంతం నుంచి వరుసగా ఇద్దరు మహిళా చైర్ పర్సన్లుగా కొత్తగూడెం మున్సిపాలిటీకి ప్రాతినిధ్యం వహించినప్పటికీ ఇక్కడి ప్రజల తలరాతలు మాత్రం మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి స్థానికంగా నివాసం ఉంటున్న ప్రజలకు భూ యాజమాన్య హక్కు చట్టం కల్పించడంలో స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్ పర్సన్, పాలకపక్షం విఫలమయ్యారని ఆరోపించారు. రామవరం ప్రాంత ప్రజలు ఒక మున్సిపాలిటీలోనే ఉంటూ రెండు చట్టాల పరిధిలోకి రావడం ఏంటో అంతుచిక్కడం లేదన్నారు. గంధం మల్లికార్జున్‌రావు, సాయి, నాగుల రవికుమార్, వినయ్, శరత్ పాల్గొన్నారు.

బీజేపీని ఆదరించండి


మాట్లాడుతున్న లక్కినేని సురేందర్

సుజాతనగర్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు లక్కినేని సురేందర్ కోరారు. సింగభూపాలెం గ్రామంలో శనివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతోమంది త్యాగాల పునాదుల మీద తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఆ ఫలితాలు కేసీఆర్ కుటుంబం మాత్రమే అనుభవిస్తోందని ఆరోపించారు. అదేవిధంగా సంక్షేమ పథకాలు అన్నీ బీఆర్‌ఎస్ కార్యకర్తలకే కట్టబెడుతున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీని గెలిపించాలన్నారు. బీజేపీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపిస్తే ప్రతి ఒక్కరి కష్టసుఖాల్లో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో లక్కినేని సాయి, నాగరాజు, బూరుగు విజయ్‌బాబు, అర్జున్, మంచినీళ్ల భాస్కర్, పవన్ నాయుడు, అనిల్‌కుమార్, మోహన్, వేణు, దేవ్‌సింగ్ పాల్గొన్నారు.

శక్తిస్వరూపిణి.. శ్రీకోటమైసమ్మ తల్లి


ఆలయంలో కొలువుదీరిన కోటమైసమ్మ తల్లి

ఇల్లెందురూరల్: శక్తిస్వరూపిణిగా పూజలందుకుంటున్న నిజాంపేట కోటమైసమ్మ అమ్మవారి జాతర ఆదివారం ప్రారంభం కానుంది. ప్రతి ఏటా విజయ దశమి సందర్భంగా రెండు రోజులపాటు అమ్మవారి జాతరను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. రేపల్లెవాడ గ్రామపంచాయతీ నిజాంపేట గ్రామ సమీపంలో సుమారు ఐదు దశాబ్దాల క్రితం వెలిసిన కోటమైసమ్మ తల్లి ఆలయంలో ఏడాది పొడవునా పూజా కార్యక్రమాలు జరుగుతుంటాయి. దసరా సందర్భంగా ఈ నెల 22న గ్రామస్తులు బోనాలతో తరలివచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించుకుంటారు. 23న శక్తిస్వరూపిణిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి



మాట్లాడుతున్న రాంచందర్ నాయక్

టేకులపల్లి: ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టి ప్రజలను చైతన్యవంతం చేయాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు గుగులోత్ రాంచందర్ నాయక్ పిలుపునిచ్చారు. శనివారం పార్టీ కార్యాలయంలో మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలు అమలులో నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమయిందన్నారు. ఈ విషయాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని, ప్రజలను చైతన్యం చేసి రాబోయే ఎన్నికల్లో ఎర్రజెండాను గెలిపించుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల సంక్షేమానికే తప్ప ప్రజా ప్రతినిధులకు కాదన్నారు. కార్యక్రమంలో అయిత శ్రీరాములు, ఎజ్జు భాస్కర్, గుగులోతు శ్రీను, వాసం భద్రయ్య, వి.సతీష్, వి.నరేందర్, ఎం.రాజు, ఈ.కృష్ణ, సీహెచ్ కోటి, బి.మోతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీగౌరి నీపూజ ఉయ్యాలో..

కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుగుతున్నాయి. ఎనిమిదో రోజు శనివారం వివిధ రకాల పూలతో మహిళలు వెన్నముద్ద బతుకమ్మలను అందంగా పేర్చారు. గౌరమ్మను ప్రతిష్ఠించి పూజలు చేసి, నువ్వులు, వెన్న, బెల్లం కలిపి నైవేద్యంగా సమర్పించారు. బతుకమ్మల చుట్టూ తిరుగుతూ... వరలక్ష్మీదేవికి చందమామ..., శ్రీగౌరి నీపూజ ఉయ్యాలో..., చారెడు బియ్యం చారెడు పప్పు.. అంటూ ఆడిపాడారు. అనంతరం సమీపంలోని చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేశారు. – సాక్షి నెట్‌వర్క్


సింగరేణి(కొత్తగూడెం): ప్రకాశం స్టేడియంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న సింగరేణి డైరెక్టర్లు


సుజాతనగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

అందరికీ 'సంక్షేమం' అందించడమే లక్ష్యం..


వనమాకు స్వాగతం పలుకుతున్న మహిళలు

చుంచుపల్లి: కొత్తగూడెం నియోజకవర్గ ప్రజల శ్రేయస్సే ముఖ్యమని, ప్రతీ ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వం అందించే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికీ అందించడమే లక్ష్యంగా మరోసారి మీ ముందుకు వస్తున్నానని, పెద్ద మనస్సుతో ఆశీర్వదించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అభ్యర్థించారు. శనివారం చుంచుపల్లి మండలం పెనగడప, రాంపురం, అంబేడ్కర్‌నగర్ గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు మేళతాళాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సుదీర్ఘ రాజకీయ జీవితంలో నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగానని, ప్రజలు నా నుంచి ఏమి కోరుకున్నారో అదే చేసినట్లు చెప్పారు. ఒకపక్క ప్రజా సంక్షేమం, మరోపక్క అభివృద్ధిని రెండు కళ్లలా భావించి నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం శ్రమిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, ఎంపీపీ బాదావత్, శాంతి, సొసైటీ చైర్మన్ మండే హనుమంతరావు, ఏఎంసీ చైర్మన్ భూక్యా రాంబాబు, ఆత్మకమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, రైతు సమన్వయ కమిటీ చైర్మన్ కరుణాకర్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి జేవీఎస్ చౌదరి, కాసుల వెంకట్, కొట్టి వెంకటేశ్వర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగరేణి గనుల వద్ద సభలకు అనుమతి లేదు

ఇల్లెందు: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సింగరేణి బొగ్గు గనుల వద్ద రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు, ప్రచారాలు నిర్వహించరాదని సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసిందని జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. శనివారం ఇల్లెందులో మాట్లాడుతూ... రాజకీయ నాయకులు, ఉద్యోగులు ఈ నిబంధనలు అతిక్రమిస్తే ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాజకీయ నాయకులు, ఉద్యోగులు గనులలో, గని పరిసరాలలో డిపార్ట్‌మెంట్లలో ఎన్నికల ప్రచార సమావేశంలో పాల్గొనకుండా సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడంలో ప్రతీఒక్కరూ సహకరించాలని కోరారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22న సద్దుల బతుకమ్మతో పాటు ఫ్యామిలీ డే వేడుకలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. స్థానిక సింగరేణి పాఠశాల గ్రౌండ్‌లో సాయంత్రం 6 గంటలకు బతుకమ్మ సంబురాలు, ఫ్యామిలీ డే వేడుకలు నిర్వహిస్తామని, ఉత్తమ బతుకమ్మ విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు.

సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేయాలి


మాట్లాడుతున్న ఊక్లా

టేకులపల్లి: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను దళారులు దోచుకుంటున్నారని, రైతులను మోసం చేస్తున్న చిల్లర పత్తి కొంటర్లను మూసివేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్లు బానోత్ ఊక్లా నాయక్, రేపాకుల శ్రీనివాస్, జిల్లా నాయకుడు గుగులోత్ రాంచందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. వర్షాభావం, జెమినీ వైరస్ వల్ల పత్తి, మిర్చి, పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. మూడు నెలలుగా వర్షాలు లేక వివిధ రకాల తెగుళ్లతో పంటలు ఎండిపోయాయని, రైతులను పట్టించుకునే నాథుడే లేడని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే సర్వే చేయించి పంట నష్టపరిహారం చెల్లించాలని కోరారు. నకిలీ విత్తనాలు అరికట్టడంలో ప్రభుత్వం విఫలమయిందని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక ఇబ్బందులు, అసంతృప్తితో సర్పంచ్‌లు..

టేకులపల్లి: మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో ఎక్కువ మంది సర్పంచ్‌లు ఆర్థిక ఇబ్బందులు, అసంతృప్తితో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ మేరకు శనివారం పలువురు అధికార పార్టీ సర్పంచ్‌లు మండల కేంద్రంలోని సేవాలాల్ ఆలయంలో రహస్యంగా సమావేశమయ్యారు. నవంబర్ 1న ఇల్లెందులో సీఎం సభ ఉన్న నేపథ్యంలో సర్పంచ్‌లు రహస్య సమావేశం ఏర్పాటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. రూ.కోట్లతో అన్ని పంచాయతీల్లో సీసీ, బీటీ రోడ్లు తదితర అభివృద్ధి పనులు జరిగినప్పటికీ సర్పంచ్‌లు అసంతృప్తిలో ఉండటం గమనార్హం. ఆయా అభివృద్ధి పనుల కోసం సర్పంచ్‌లు ముందస్తుగా అధికారులకు రూ.లక్షల్లో ముట్టచెప్పిట్లు, కానీ పనులు మాత్రం సర్పంచ్‌లకు కాకుండా ఇతర వ్యక్తులకు అప్పగించడంతో వారు అసంతృప్తిలో ఉన్నట్లు సమాచారం. సభలు, సమావేశాలకు జన సమీకరణకు కూడా సర్పంచ్‌లపైనే భారం పడుతోందని దీంతో ఆర్థిక సమస్యలతో సతమతం అవుతున్నట్లు చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఆర్థిక భారంతో సతమతం అవుతున్న సర్పంచ్‌లు సీఎం సభ సమీపిస్తుండటంతో ఎదురయ్యే ఖర్చులపై సమాలోచన చేశారు. ప్రజాప్రతినిధులతో పాటు కొందరు నాయకులు సైతం ఆర్థిక భారంతో సతమతం అవుతున్నట్లు మనసు విప్పి మాట్లాడుకున్నారు. నిప్పు రాజుకుంది.. సీఎం బహిరంగ సభ రోజు వరకు గానీ పొగ బయటకు వస్తుందేమోనని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు. ఇదిలా ఉండగా శనివారం రాత్రి ఎమ్మెల్యే హరిప్రియ, హరిసింగ్ నాయక్‌తో పాటు ముఖ్య నాయకులు టేకులపల్లిలో అసంతృప్త సర్పంచ్‌లతో మాట్లాడి వారిని బుజ్జగించారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు హామీ ఇవ్వడంతో సర్దుకున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం పంపిణీ

కొత్తగూడెంఅర్బన్: మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు శనివారం మున్సిపల్ కమిషనర్ రఘు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మహిళలకు చీరలు, టవల్స్, పురుషులకు ఒక జత యూనిఫాం ఇచ్చామని, కార్మికులు వీటిని ధరించి పనులు నిర్వహించాలన్నారు. మున్సిపల్ టీపీఎస్ ప్రభాకర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్స్, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా నవరాత్రి వేడుకలు..

దసరా సందర్భంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయాల్లో, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఏడో రోజు శనివారం శ్రీ వనదుర్గా దేవీగా, సరస్వతీ దేవిగా, శ్రీ మహిషాసుర మర్దినీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మహిళల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నికల సీజన్ కావడంతో పలువురు రాజకీయ నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


ఇల్లెందురూరల్: పూజ చేస్తున్న భక్తులు


కొత్తగూడెంటౌన్: రామవరం నెహ్రూ బస్తీలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు


సుజాతనగర్: నర్సింహసాగర్‌లో మండపంలో దుర్గామాతకు పూజలు


పెద్దమ్మ తల్లి దేవాలయ పూజారికి మొక్క అందజేస్తున్న రాజశేఖర్


జూలూరుపాడు: పాపకొల్లులో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు


పాల్వంచ: వెంగళరావు కాలనీలో పూజలు చేస్తున్న ఎస్‌పీఎఫ్ అసిస్టెంట్ చీఫ్ కమాండెంట్ అప్పాజీ


టేకులపల్లి రామాలయం వద్ద శాకంబరీ దేవి అవతారంలో అమ్మవారు


కోయగూడెంలో అమ్మవారి మండపం వద్ద భక్తులకు అన్నదానం


ఇల్లెందురూరల్: అన్నదానాన్ని ప్రారంభిస్తున్న సుభాష్‌నగర్ సర్పంచ్, ఎంపీటీసీ